కథ

# చిన్నారి

సాహిత్య ప్రకాశ్

కర్నూల్ టౌన్..
రైల్వేస్టేషన్..

మధ్యాహ్నం మూడు గంటలకి కర్నూల్‌నుంచి సికింద్రాబాద్‌కి బయలుదేరాల్సిన తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ ఒకటో నెంబర్ ప్లాట్ ఫారమ్ మీద బయలు దేరడానికి సిద్ధంగా ఉంది.

నేను నా లగేజ్‌తో హడావిడిగా ఓ కంపార్ట్ మెంట్‌లోకి ఎక్కేశాను. పండగ సీజన్ కావడంతో రద్దీ ఎక్కువగా ఉంది. ఓ చోట సర్దుకుని కూర్చున్నాను. రైలు కదిలింది. అలవాటు ప్రకారం నా చేతుల్లో ఉన్న వీక్లీలోకి తల దూర్చాను.

ఇంతలో.. కూతురి మీద ఓ తల్లి తిట్ల దండకం వినిపించింది. ఆ వెంటనే పాప ఏడుపు మొదలయ్యింది. కాసేపటికి పాప తల్లితో పాటు తండ్రి కూడా తిట్టేందుకు పోటీ పడ్డాడు. చదువుతూ వున్న మ్యాగజైన్ లోంచి తలెత్తి చూశాను. ఆ పక్క సీట్లో భార్యాభర్తలూ, వారి ఇద్దరు పిల్లలూ కనిపించారు. బాబుకి పదేళ్లుంటాయి. పాపకి ఏడెనిమిది ఉండొచ్చు. బాబు తెల్లగా, ముద్దుగా ఉన్నాడు. పాప చామనచాయలో పీలగా వుంది. బాబుచేతిలో ఖరీదైన చాక్లెట్ బార్ ఉంది. పాప చేతిలో ఏవీ లేవు. ఆ చిన్నారి ఏడుస్తూనే ఉంది.

''నీ దరిద్రపు గొట్టు మొహానికి చాక్లెట్ కావల్సి వచ్చిందా..?'' అంటూ నేను చూస్తుండగానే ఆ తల్లి పాపకి మళ్లీ రెండు తగిలించింది.

''వద్దు మమ్మీ.. కొట్టొద్దు మమ్మీ..'' పాప ఏడుస్తూ తల్లిని ప్రాథేయ పడుతోంది.

''నోర్ముయ్..! ఏడుపాపకపోతే చంపేస్తాను'' మరో వైపునుంచి తండ్రీ ఆ చిన్నారిని ఎడాపెడా కొట్టాడు.

పాప పంటి బిగువున దుఃఖాన్ని కంట్రోల్ చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది చుట్టూ ఉన్న వాళ్లంతా చోద్యం చూస్తున్నట్టు ఉండి పోయారు. కానీ..నేను తట్టుకోలేక పోయాను.


''సార్.. ప్లీజ్ కొట్టకండి.. కొట్టకండి..'' అభ్యర్థనగా అన్నాను.

''ఏంటీ.. కొట్టకూడదా..?!ఈ తారుడబ్బాని ముద్దు పెట్టుకోవాలా?'' వెటకారంగా అంది పాప తల్లి.

''మా ఖర్మకొద్దీ దాపురించింది. ఇనుపగజ్జెల తల్లి... చూడండి మిడిగుడ్లేసుకుని ఎలా చూస్తోందో..?'' పాప తలపై గట్టిగా మొట్టి కాయలు వేశాడు తండ్రి.

''ఏంటండీ ఇదీ.. ఏదో చిన్నపిల్ల.. తప్పు చేస్తే మందలించాలి గానీ ఇలా..'' అని వచ్చి పాపని దగ్గరికి తీసుకున్నాను. నా ఆసరా దొరకడంతో పాప ఏడుస్తూ నన్ను చుట్టుకుంది. ఎక్కిళ్లు ఆగడం లేదు.

''దీని పుట్టుకే చెడు పుట్టుక. మా ఇంట్లో చెడ



పుట్టింది'' అన్నాడు తండ్రి.

''ఇది పుట్టి భూమ్మీద పడగానే మా అమ్మ పోయింది. మా మావయ్య పోయాడు. బ్రహ్మరాక్షసి.!'' మరింత ఏవగింపుతో అంది తల్లి.

పాప పుట్టుక ఆ పెద్దవాళ్ల చావుకెలా కారణమౌతుందీ?! చదువుకున్న వాళ్లు కూడా ఇలా ఇంత మూర్ఖంగా ఆలోచించడమూనా?! వాళ్ల తీరు ఎంతో దారుణంగా అమానుషంగా నాకనిపించింది.

''అసలేం జరిగిందండీ?'' చాలా నెమ్మదిగా అడిగాను.

''వేలెడంత లేదు. ప్రతిదానికీ వీడితో పోటీ పడుతుంది. వీడికేం కొనిస్తే ఇదీ అదే కావాలంటుంది.'' అన్నాడు తండ్రి అదేదో మహా నేరమైనట్టు.

''చిన్నపిల్ల కదండీ. అలా అడగడంలో తప్పేవుందీ?'' అన్నాను.

''తప్పా.. తప్పున్నరా..? వీడెక్కడా. ఇదెక్కడా..?'' అన్నాడు తండ్రి.

''వీడు మా బంగారు కొండ.. వరాలమూట..'' అని బాబుని దగ్గరికి తీసుకుని ప్రేమగా వాడి బుగ్గనముద్దు పెట్టుకుంది తల్లి.

''అంటే.. ఈ పాప.. మీ..?'' అని నేనంటూండగానే..

''మాదే.. పాపిష్టిది..'' అసహ్యంగా వొత్తి పలుకుతూ అంది తల్లి.

''అయినా పాపకేమయ్యిందండీ..? నల్ల రూపున వున్నా కళగానే వుందీ..'' అన్నాను.

''అలాగాండీ.. అయితే ఈ 'కళా'రాణిని మీరే తీసుకెళ్లండి. పీడా విరగడౌతుంది..'' అంది అదే ధోరణిలో తల్లి.

''నిజం సార్.. మీరుదీన్ని మీ వెంట తీసుకెళ్లండి. మాకే అభ్యంతరం లేదు'' తండ్రీ వంత పాడాడు.

పాప ఎక్కిళ్లు మాత్రం తగ్గడం లేదు. బాబు చాక్లెట్ తింటూ ఎంజాయ్ చేస్తున్నాడు.

పిల్లలిద్దరికీ వాళ్లు కన్న తల్లిదండ్రులు! కానీ పిల్లల విషయంలో వాళ్లెందుకంత వ్యత్యాసం చూపుతున్నారు? మగ పిల్లాడనీ, పైగా అందంగా వున్నాడనీ బాబు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, పాపని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆ తేడా ఆ పసిమనసుని ఎంత కలచి వేస్తుందో వాళ్లు ఆలోచించడం లేదు. పాప నలుపుగా పుట్టడం నేరమా.?

అలా అయితే మరి కన్నవారిదో..?! వాళ్లూ నలుపుగానే వున్నారు కదా?!

మరి వాళ్ల ప్రమేయాన్ని కప్పి పుచ్చుకుని చిన్నారినెందుకు తిట్టి పోస్తున్నారు?! అది నన్ను తీవ్రంగా కలచివేసింది. పైగా బాబుకి ఖరీదైన డ్రెస్ వేయించి పాపకి సాదాసీదా గౌను తొడిగారు. వాడికి బిస్కట్లూ, చాక్లెట్లూ కొనిచ్చారు. పాపకస్సలు ఏవీ ఇప్పించలేదు. ఇద్దరూ వాళ్ల కన్నబిడ్డలే..కానీ పెంపకంలో అంత తేడానా..?!

కాసేపు వాళ్ల మధ్యనే కూర్చుని పిల్ల లిద్దరితో మాట్లాడితే మరిన్ని బాధాకరమైన విషయాలు బయటపడ్డాయి. బాబు కార్పొరేట్ స్కూల్లో ఇంగ్లీషు మీడియంలో చదువుతోంటే, పాప మామూలు కాన్వెంట్లో తెలుగు మీడియంలో చదువుతోంది.

ఎంత కసాయి తల్లిదండ్రులు..?!

పిల్లలిద్దరినీ సరదాగా కొన్ని జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలడిగితే బాబు కంటే పాపే ఎక్కువగా కరెక్ట్ సమాధానాలిచ్చింది. చదువులో బాబుకంటే పాపే చురుగ్గా వుంది. కానీ తల్లిదండ్రుల ప్రేమకి నోచుకోకుండా నిరాదరణకి గురౌతోంది. ఆ తల్లిదండ్రుల ఆలోచన తప్పనీ, తీరు మార్చుకోమని వాళ్లకి అర్థమయ్యేలా ఎలా చెప్పాలో నాకు బోధపడటం లేదు. ఆలోచిస్తుంటే బుర్ర వేడెక్కి పోతోంది. అక్కడినుంచి లేచి వెళ్లి కాసేపు తలుపు దగ్గర నిలబడి పచ్చని పంటపొలాల మీదనుంచి వచ్చే కమ్మని వాసనను, పిల్లగాలిని ఆస్వాదించాను. కానీ మనసుని ఆ చిన్నారి నుంచి మరల్చలేకపోయాను. ఆ పాప దీన వదనమే గుర్తుకొస్తోంది. మళ్లీ యధావిధిగా వెనక్కి వచ్చి నా సీట్లో కూర్చుండి పోయాను. పాప బెదురు చూపులు చూస్తోంది. సడెన్‌గా నాకు నా బ్యాగ్‌లో వ్ను లడ్డూలు గుర్తుకొచ్చాయి. వెంటనే వాటిని తీసి పాపకో రెండూ, బాబుకో రెండూ ఇచ్చాను.

పాప తినకుండా తల్లిదండ్రుల వైపు భయంగా చూస్తోంది.

''తిని చావు.. ఇందాకట్నుంచి కావాలని ఏడ్చి చస్తున్నావుగా..!'' కసురుకుంది తల్లి.

''ఏంటి మేడమ్ అదీ.. పాపని తిననివ్వండీ.. ప్లీజ్..'' అన్నాను.

''ఊ.. తిను..'' గద్దించాడు తండ్రి.

బెదిరిపోయిన చిన్నారి తినకపోతే మళ్లీ కొడతారేమోనని ఓ లడ్డూని కొరుక్కు తినడం మొదలు పెట్టింది. అది నాకెంతో రిలీఫ్ నిచ్చింది.

***

''కుర్రో.. కుర్రు... కుర్రు..''అంటూ ఓ కోయదొర వచ్చాడు. అందరినీ పరిశీలనగా చూస్తూ మా సీటు దగ్గరకొచ్చి ఆగిపోయాడు. లడ్డూ తింటోన్న పాపని ఆశ్చర్యానందాలతో చూశాడు. చుట్టూ వున్న వారికి కొయదొర ధోరణి అర్థంకాక అయోమయంగా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

''బెజవాడ కనకదుర్గమ్మ, కంచి కామాక్షమ్మ, మధుర మీనాక్షమ్మ, కాశీ విశాలాక్షమ్మ..'' అంటూ పాపని పొగడటం మొదలు పెట్టాడు.

అంతా వింతగా చూస్తున్నారు. పాప తల్లిదండ్రుల పరిస్థితి కూడా అదే. పాప దైవాంశ సంభూతురాలనీ, ముగ్గురమ్మల ముద్దుబిడ్డ అనీ, అమ్మవారి అనుగ్రహంతో పుట్టిన ఆ చిన్నారి మూలంగా తల్లిదండ్రులు భవిష్యత్తులో కోట్లకి పడగలెత్తుతారనీ, వారికి ఆయురారోగ్యాలు కలుగుతాయనీ చెప్పాడు. ఆయన మాటలకు పాప తల్లిదండ్రులు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యారు.

''ఈ సిన్నారి సిరిగల తల్లి..'' అని పాపకి రెండు చేతుల్తో దణ్ణం పెట్టి ముందుకు కదిలాడు కోయదొర.

తల్లిదండ్రులిద్దరూ పాపని దగ్గరికి తీసుకుని ఆనందంగా ముద్దులతో ముంచెత్తారు. ఎన్నడూ అనుభవంలోకి రాని తల్లిదండ్రుల ఆప్యాయతకి బిత్తరపోయి చూస్తుండిపోయింది చిన్నారి. తల్లిదండ్రులిద్దరూ పోటీపడి పాపకి తినుబండారాలన్నీ అందించారు. ఆ దృశ్యం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. మనసెంతో తేలికయ్యింది.

అయితే.. పాప గురించి ఆ కోయదొరకి చెప్పి, ఆయనని వేడుకొని అలాచెప్పించింది నేనేనన్న విషయం నా దగ్గరే రహస్యంగా ఉండిపోయింది.

ఓ మంచి పనికోసం కోయదొర సహకారం తీసుకోవటం నాకయితే తప్పనిపించలేదు. మరి మీకూ..?!?!

*

ఊరించే సంగతులు
ఊహకందని మలుపులు
కొసమెరుపులు.. వెరసి
శ్రీధర కథలు
త్వరలో ప్రారంభం